www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 15 అక్టోబర్ 2025
5
తిరుపతి



తుడాలో శుభంబన్సల్‌కు సత్కారం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



రాష్ట్రంలోనే తుడా అగ్రస్థానంలో ఉండాలని వైస్ చైర్మన్ శుభం బన్సల్ అధికారులను కోరారు. లే అవుట్లలో ఫ్లాట్ల అభివృద్ధి, అమ్మకం ద్వారా ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఎక్కువగా ఉందన్నారు.తుడా వైస్‌చైర్మన్‌గా గత నాలుగు నెలల్లో శుభంబన్సల్ అందించిన సేవలను డాక్టర్ ఎన్‌వి శ్రీకాంత్‌బాబు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఎల్‌ఎఒ సృజన, సిపిఒ దేవికుమారి, పరిపాలన అధికారి శైలజ పాల్గొన్నారు.

సిఐటియు తిరుపతి జిల్లా నూతన నాయకత్వం



కార్మికవర్గ స్థాపనకు..కంకణబద్ధులౌదాం..!

స్ఫూర్తి నింపిన 'సిఐటియు' జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, పుత్తూరు టౌన్



'కార్పొరేటీకరణ.. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించి కార్మిక రాజ్యస్థాపనకు కంకణబద్ధులౌదాం' అంటూ తిరుపతి జిల్లా సిఐటియు మహాసభ పిలుపునిచ్చింది. కార్మిక హక్కులు, ఉద్యోగభద్రత, కనీస వేతనం సాధించుకునేందుకు సమరశీల పోరాటాలు చేసేలా శ్రేణుల్లో స్ఫూర్తి నింపింది. ప్రజా మద్దతుతో కార్మిక ఉద్యమాలను తీవ్రతరం చేస్తూ, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక హక్కులను కాపాడుకునేలా భవిష్యత్ ఉద్యమాలు ఉంటాయని నూతన నాయకత్వం ప్రకటించింది.

తిరుపతి జిల్లా పుత్తూరు పట్టణంలో విఎస్ఎన్ కల్యాణ మండపంలో రెండు రోజుల పాటు సిఐటియు 8వ జిల్లా మహాసభలు జరిగాయి. తొలిరోజు జెండా ఆవిష్కరణతో ప్రారంభమైన మహాసభ రెండో రోజు నూతన నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ముగిసింది. ఈ మహాసభ 28 తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించుకుంది. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ముగింపు ఉపన్యాసం చేస్తూ విద్యుత్ కార్మికుల సమ్మెకు సిఐటియు శ్రేణులు ప్రత్యక్షంగా బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తూ సంఘాన్ని బలోపేతం చేసేందుకు చారిత్రాత్మక పోరాటాలు చేసిన అంగన్‌వాడీ సంఘం చేదోడువాదోడుగా నిలవాలన్నారు. డిజిటల్ క్యాపిటలిజం నడుస్తున్న ప్రస్తుత తరుణంలో స్విగ్గీ, జొమాటో సంస్థలు యువతను శ్రమదోపిడీ చేస్తున్నాయన్నారు. ఈ దోపిడీని గుర్తించిన యువత గుంటూరు, విశాఖపట్నంలో సమ్మెకు దిగాయని, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుపతిలోనూ వేలాదిమందిని కదిలించేలా చూడాలని కోరారు. గత ప్రభుత్వంలో ఐదువేల రూపాయలకే వాలంటీర్లు పనిచేశారని, కూటమి ప్రభుత్వం వీరిని విస్మరించిందన్నారు. వారి తరపున పోరాడుతున్న ఏకైక సంఘం సిఐటియు అన్నారు. వాలంటీర్లను కదిలించాలన్నారు. ఆబ్కాస్ ఉద్యమాలు తిరుపతిలో అనుకున్న స్థాయిలో జరిగాయని, రాష్ట్రంలో అంతగా లేదన్నారు. తిరుపతిని ఆదర్శంగా రాష్ట్రం తీసుకుంటుందన్నారు. విజయాలను, లోపాలను ఎప్పటికప్పుడు సంఘం గుర్తించి భవిష్యత్ ఉద్యమాలకు బాటలు వేయాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ సిఐటియు జిల్లా మహాసభలు పుత్తూరు పట్టణంలో జయప్రదంగా జరిగాయన్నారు. రెండు రోజుల పాటు 28 తీర్మానాలను చర్చించి, ఆమోదించుకున్నామన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, పర్మినెంట్ కార్మికులు పాల్గొన్నారన్నారు. వారి సమస్యలు పరిష్కరించేలా పోరాటాల రూపకల్పన జరిగిందన్నారు. 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 13 గంటల పని విధానాన్ని తీసుకొచ్చిన చంద్రబాబు ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఉద్యమించాలని మహాసభ తీర్మానం చేసిందన్నారు. 23 మందితో జిల్లా ఆఫీసు బేరర్స్, 56 మందితో జిల్లా కమిటీ ఏకగ్రీవమయ్యిందన్నారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్, జిల్లా నాయకులు టి.సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, ఇ.శివకుమార్, ఆర్.వెంకటేష్, వందవాసి నాగరాజు, అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్, జి.బాలసుబ్రమణ్యం, ఆర్.లక్ష్మి, వాణిశ్రీ, కెఎన్ఎల్ ప్రసాద్, రామకృష్ణ, మునిరాజా, వేణుగోపాల్, మాధవకృష్ణ, బుజ్జి పాల్గొన్నారు.



మామిడి రైతులకు రూ.146.84 కోట్లు జమ

20వేల మంది రైతులకు లక్షకు మించి... సబ్సిడీ జమకాని వారికి 30లోపు అవకాశం / 21మందికి రూ.5లక్షలు పైగా లబ్ది ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై కలెక్టర్ మండిపాటు

ప్రజాశక్తి - యాదమరి



మామిడి రైతులకు సబ్సిడి జమ చేసినట్లు చెబుతున్న చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

మామిడి రైతులకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జిల్లాలోని 31,929 మంది రైతుల ఖాతాలకు రూ.146.84 కోట్లు సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో మామిడి రైతులకు సబ్సిడీపై ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ మామిడి రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.4 సబ్సిడీ ప్రకటించిన ప్రకారం జిల్లాలో 31,929 మంది రైతులకు సంబంధించి 3.67 లక్షల మెట్రిక్ టన్నుల మామిడికి రూ.146.84 కోట్లు డిబిటి పద్ధతిలో నేరుగా రైతుల ఖాతాలకు జమ చేశామన్నారు. ఇందులో బంగారుపాలెం మండలానికి చెందిన రైతులకు ఎక్కువ మొత్తం జమ అయ్యిందని, జిల్లాలో 20 వేల మందికి పైగా రైతులకు లక్ష రూపాయలకు మించి సబ్సిడీ జమ చేశామన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో లేని విధంగా మామిడి రైతులకు సబ్సిడీ, మద్ధతు ధరలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అందించిందని, రైతులకు అండగా నిలిచిన ప్రభుత్వానికి జిల్లా మామిడి రైతాంగం తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈక్రాప్ బుకింగ్, క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం సబ్సిడీ పరంగా ఖచ్చితమైన నిర్ధారణకు రావడం జరిగిందన్నారు. అర్హత కలిగి నగదు జమ కాని రైతులు ఆందోళన చెందనవసరం లేదని అక్టోబర్ 30వ తేది వరకు తమ వినతులను ఆర్ ఎస్ కె, మండల, జిల్లా స్థాయి ఉద్యాన అధికారులకు సమర్పించవచ్చునని, వారి అర్హతను 48 గంటలలో నిర్ధారించడం జరుగుతుందన్నారు. రూ.5 లక్షలకు మించి సబ్సిడీకి సంబంధించి 21 మంది రైతులు ఉన్నారని, వీరి అర్హతను పరిశీలించి నగదు జమ చేస్తామన్నారు. గుడిపాల, పుంగనూరు, బంగారుపాళెంలోని ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ధరలను మామిడి రైతులకు అందించని కారణంగా ప్రభుత్వం పరంగా పరిశ్రమల శాఖ నుండి ఎటువంటి సహకారం అందించడం జరగదని, రైతులకు మేలు చేసే పరిశ్రమలకు మరింత ప్రోత్సాహకాలు, సహకారం అందిస్తామన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు కేవలం రాజయకీయంగా, వ్యాపారపరంగా మాత్రమే కాకుండా రైతుల సంక్షేమాన్ని కొంత వరకు దష్టిలో ఉంచుకుని పని చేయాలని తెలిపారు.

గుజ్జు పరిశ్రమల లైసెన్సులు రద్దు చేయాలి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం

'గుజ్జు పరిశ్రమ చెల్లించాల్సిన ఎనిమిది రూపాయలు ఎక్కడ' అని రైతు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జనార్ధన్, మునీశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బుధవారం జరిగే రైతు ఆక్రందన సభపై మీడియా సమావేశం జరిగింది. మామిడి రైతుల ఆక్రందన సభ నేపథ్యంలో ఒకరోజు ముందు ప్రభుత్వం అందించాల్సిన నాలుగు రూపాయల చొప్పున రూ.146 కోట్లు విడుదల చేయడం హర్షదాయకమన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.12 ఒకేసారి జమ చేసి ఉంటే రైతులకు సబబుగా ఉండేదన్నారు. నేటికీ ప్రభుత్వం నిర్ణయం అమలు చేసేందుకు గుజ్జు పరిశ్రమల యజమానులు ముందుకు రాని నేపథ్యంలో ప్రభుత్వం వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మాట వినకపోతే గుజ్జు పరిశ్రమల లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సురేంద్ర, కె.మునిరత్నం నాయుడు, బి.శ్రీనివాస్, సంజీవరెడ్డి, బి.మురళి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మద్దతు ప్రకటించారు.

నేడు మామిడి రైతుల ఆక్రందన సభ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్

మామిడి టన్నుకు 8 వేల రూపాయలు చెల్లించకుండా జ్యూస్ ఫ్యాక్టరీ యజమానులు మామిడి రైతులను దగా చేయడాన్ని నిరసిస్తూ గురువారం బంగారుపాళ్యం మార్కెట్ యార్డ్ వద్ద మామిడి రైతుల సంక్షేమ సంఘం నేతృత్వంలో ఆక్రందన సభ నిర్వహించనున్నారు.మామిడి రైతుల ఆక్రందన సభకు సిపిఎం అనుబంధ రైతు సంఘం నాయకులు ప్రభాకర్ రెడ్డి, సిపిఐ రైతు సంఘం నాయకులు రామానాయుడు, కాటమయ్య, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వాడ గంగరాజు, నాగరాజు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పోటుగాని భాస్కర్, జనసేన జిల్లా నాయకురాలు కవిత, సిపిఐ ఎంఎల్ నాయకులు వెంకయ్య, వెంకటరత్నం మామిడి రైతులకు మద్దతుగా ఆక్రందన సభలో పాల్గొననున్నారు.

పీఎం సూర్యఘర్ సక్సెస్ చేయాలి: ఎమ్మెల్యే ఆరణి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



ఏపీ సదరన్ డిస్కం నూతన సిఎండి ఎల్. శివశంకర్ ను మంగళవారం మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భేటీ అయ్యారు. ఈ భేటీలో మెరుగైన విద్యుత్ అందించేందుకు అవసరమైన విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుపై ఇరువురూ చర్చించారు. అలాగే అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ నెట్వర్క్ అమలుపై చర్చించారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు వినియోగించుకునేలా ప్రోత్సహించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సిఎండి శివ శంకర్ ను కోరారు. సోలార్ విద్యుత్ వినియోగం పెంచడం ప్రభుత్వ లక్ష్యమని తప్పనిసరిగా పీఎం సూర్యఘర్ పథకాన్ని సక్సెస్ చేసేందుకు ప్రయత్నిస్తామని సిఎండి శివ శంకర్ తెలిపారు. ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శివశంకర్ ను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు.

వ్యసనాలపై ప్రత్యేక నిఘా : ఎస్పీ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

తిరుపతి జిల్లాలో డ్రగ్స్‌కు ఎట్టి పరిస్థితులను తావు ఉండదని జిల్లా ఎస్పీ యల్. సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, వ్యసనాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని వెల్లడించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్సీ గేట్ రైల్వే ట్రాక్ సమీపంలో ముగ్గురు వ్యక్తులు మత్తు ఇంజక్షన్లు వేసుకుంటున్నట్లు డ్రోన్ పర్యవేక్షణ ద్వారా గుర్తించమన్నారు. తక్షణమే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ముగ్గురినీ అదుపులోకి తీసుకుని, వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చి విచారణ చేపట్టారు. తిరుపతి పోలీసుల ఈ సమయస్ఫూర్తి చర్యతో, మత్తు పదార్థాల వినియోగంపై మరోసారి గట్టి హెచ్చరిక అందిందన్నారు. మత్తు పదార్థాల వినియోగం, విక్రయం గమనించిన వెంటనే డయల్ 112కి సమాచారం ఇవ్వాలని సూచించారు.

నూతన ఉపాధ్యాయులకు యుటిఎఫ్ స్వాగతం



ప్రజాశక్తి -తిరుపతి టౌన్

మెగా డిఎస్సీ ద్వారా తిరుపతి నగరపాలక సంస్థలో ఉపాధ్యాయ విధుల్లో చేరిన వారిని యుటిఎఫ్ తిరుపతి నగరపాలక సంస్థ వారు సాదరంగా ఆహ్వానం పలికి వారందరికీ సేవా పుస్తకాలు, సర్వీస్ రిజిస్టర్లు అందించారు. స్థానిక శ్రీ పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నూతన ఉపాధ్యాయులు విద్యార్థుల పురోభివద్ధిలో ముందుండాలని, అలాగే ఉపాధ్యాయ ఉద్యోగ పోరాటాలలో సైతం చురుగ్గా పాల్గొనాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బండి మధుసూదన్ రెడ్డి తెలియజేశారు. నూతన ఉపాధ్యాయుల చేరికతో పాఠశాల మరింత మెరుగ్గా ముందుకు సాగుతుందని ప్రధానోపాధ్యాయులు పరంజ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధ్యక్షులు వై హేమాద్రి బాబు, ప్రధాన కార్యదర్శి ఎస్ ఖాదర్బాషా, కోశాధికారి ప్రభుకుమార్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎన్ మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు వరలక్ష్మి పాల్గొన్నారు. విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా నూతన ఉపాధ్యాయులు పని చేయాలని ఎంఇఒలు బాలాజీ, భాస్కర్‌నాయక్ తెలిపారు. తిరుపతి అర్బన్‌లో 53 మంది ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. ఎస్టియూ పరిచయ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.

ప్రచారానికి రూ.20 కోట్లడిగినట్లు విష ప్రచారం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి


వినుత ఆడియో వైరల్

హత్యకు గురైన రాయుడు పాత వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన నాటి నుంచి జనసేన మాజీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి కోటా వినుత మరింత దూకుడు పెంచారు. సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుని సిట్టింగ్ ఎమ్మెల్యేపై వీడియో, ఆడియో రికార్డుల బాణాలను వదులుతున్నారు. తాజాగా మంగళవారం ఎన్నికలకు ముందు తిరుపతి జిల్లా టిడిపి ఇన్చార్జితో తాను సంభాషించిన ఆడియో రికార్డును సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. తాను కూటమి అభ్యర్థి తరపున ప్రచారం చేయడానికి రూ.20 కోట్లు డిమాండ్ చేసినట్లుగా అభ్యర్థి కుటుంబం తనపై విష ప్రచారం చేసినట్లుగా సదరు టిడిపి జిల్లా ఇన్చార్జి తో వాపోయినట్లుగా ఆ ఆడియో రికార్డులో ఉంది. తనకు టికెట్టు రాలేదన్న బాధ ఉన్నా కూటమి అభ్యర్థి గెలుపు కోసం కష్టపడుతున్నట్లు ఆడియోలో చెప్పుకొచ్చారు. అయినా కూడా కూటమి అభ్యర్థి తనను దూరం పెట్టినట్లుగా అప్పటి టిడిపి జిల్లా ఇంచార్జితో మొరపెట్టుకున్న ఆడియో ప్రస్తుతం వైరల్ అవుతుంది. ముమ్ముందు ఇంకెన్ని వీడియో, ఆడియోలు సామాజిక మాధ్యమాల వేదికగా వినుత బయటపడుతుందోనని రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

పరకామణి కేసు పునర్విచారణ

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల పరకామణి చోరీ కేసుకు సంబంధించి సీఐడీ బందం దర్యాప్తు ప్రారంభించింది. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు విచారణ మొదలుపెట్టింది. ఈ క్రమంలో సీఐడీ డీజీ రవిశంకర్ అయన్నార్ బందం మంగళవారం తిరుమలలో పర్యటించింది. శ్రీవారి ఆలయ పరకామణిని పరిశీలించింది. దీనిపై తిరుమల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లోనూ నమోదైన రికార్డులను పరిశీలించింది. 2023 మార్చిలో శ్రీవారి ఆలయ పరకామణిలో చోరీ జరిగింది. 920 విదేశీ డాలర్లు చోరీ చేస్తూ టీటీడీ ఉద్యోగి రవికుమార్ పట్టుబడ్డాడు. 40 కోట్ల విలువైన ఆస్తులను టీటీడీకి రాసిచ్చి, గతంలో ఈ కేసును రాజీ కుదుర్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఈ ఘటనపై టీటీడీ పూర్తిస్థాయి విచారణ నిర్వహించలేదని ఇటీవల ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీంతో ఈ కేసును తిరిగి దర్యాప్తు చేయాలని ఏపీ హైకోర్టు ఆదేశించింది. లోక్ అదాలత్ ఇచ్చిన ఆదేశాలను నిలిపివేసింది.



అనధికారిక నిర్మాణాలను అడ్డుకున్న ప్లానింగ్ సిబ్బంది

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

నగరపాలక సంస్థ పరిధిలోని మధురానగర్ లో అనధికారికంగా జరుగుతున్న అదనపు నిర్మాణాలను మంగళవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది అడ్డుకున్నారు. మధురా నగర్ 17 వ సచివాలయం పరిధిలో అనధికారిక నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశాల మేరకు పరశీలించామని డిసిపి ఖాన్ తెలిపారు. అక్కడ జరుగుతున్న అదనపు నిర్మాణలకు ఎటువంటి అనుమతులు లేకపోవడంతో సెంట్రింగ్ వర్క్ తొలగించి నిర్మాణాలను అడ్డుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మూర్తి, టిపిఓ వంశీ, టిపిబిఓ సంతోష్, ప్లానింగ్ సెక్రటరీ లు అక్బర్, మునీంద్ర, పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన బెల్జియం కాన్సుల్ జనరల్

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

బెల్జియన్ పారిశ్రామిక ప్రయోజనాల చర్చల నిమిత్తం ముంబైలోని బెల్జియం కాన్సుల్ జనరల్ ఫ్రాంక్ గీర్కెన్స్ మంగళవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ఇక్కడ పెట్టుబడి అవకాశాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, వ్యాపార అనుకూల వాతావరణం గురించి వివరించారు. వెర్మీరిన్ సంస్థ అధునాతన వీల్‌చైర్లు తయారు చేయడం ద్వారా బెల్జియం పరిశ్రమలకు శ్రీసిటీలో పునాది వేసిందని ప్రశంసించారు. వెర్మీరిన్ సంస్థకు శ్రీసిటీ మద్దతును అభినందిస్తూ, మరిన్ని బెల్జియన్ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు.



కరూర్ వైశ్యాబ్యాంకు వద్ద బ్యాంకు ఉద్యోగుల నిరసన

ప్రైవేటు బ్యాంకులను జాతీయం చేయాలి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రైవేటు బ్యాంకులను జాతీయకరణ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సాయంత్రం ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు తిరుపతి బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో కరూర్ వైశ్యా బ్యాంక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి విజయ భాస్కర్, ధన్వంత్ కుమార్ మాట్లాడుతూ దేశంలో ఉన్న అన్ని ప్రైవేట్ బ్యాంకులు జాతీయకరణ చేయాలని డిమాండ్ చేశారు. క్లారికల్, సబ్ స్టాఫ్ ఉద్యోగుల నియామకాలు వెంటనే చేయాలని కోరారు. ఫెడరల్ బ్యాంకుల అనుమతులు రద్దు చేయాలన్నారు. ప్రైవేట్ బ్యాంకులు పెన్షనర్లకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. తమిళనాడు మార్కె టైల్ బ్యాంకు ను ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 సంవత్సరాలు పెంచాలని కోరారు. నైనిటాల్ బ్యాంకు అమ్మకాన్ని ఆపి బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనం చేయాలని కోరారు. ప్రైవేటు బ్యాంకులు పెన్షన్ నిధి పై సిబిడిటీ మినహాయింపు ఇవ్వాలన్నారు.

ఈ కార్యక్రమంలో కమిటీ సభులు జనార్ధన్, యగ్నేష్ బాబు, కేశవరెడ్డి, భాస్కర్, రేష్మ , , సుమంతి, నిర్మల దేవి, పవన్ కుమార్,, వెంకటలక్ష్మి, , లక్ష్మీపతి, మహేష్, శంకర్ రావు, నటరాజ్ పాల్గొన్నారు



జిల్లా జర్నలిస్ట్ క్రికెట్ టీంకు కలెక్టర్ ప్రశంస

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

అనంతపురం ఆర్డిటి రంజీ స్టేడియం వేదికగా జే శాప్ నిర్వహించిన ప్రతిష్టాత్మక జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్ -2025 టోర్నీలో రాష్ట్ర విజేతగా నిలిచిన ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టును జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రశంసించారు. మంగళవారం జిల్లా క్రికెట్ జట్టును కలెక్టరేట్ లోని ఆయన చాంబర్ లో కలెక్టర్ మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా జట్టు రాష్ట్ర స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో ఛాంపియన్స్ గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. ముమ్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా జట్టుకు తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ ను కలిసిన వారిలో జేశాప్ జిల్లా అధ్యక్షులు విజయ యాదవ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, కోశాధికారి నరేష్ రెడ్డి, కెప్టెన్ పులుగూరు శ్రీనివాసులు, క్రీడాకారులు కామేష్(ప్రజాశక్తి), చిన్నబాబు, వెంకటేష్, మనోహర్, జగదీష్, సుబ్రమణ్యం, సురేష్, ప్రతాప్, నరేష్, మదిఅలగన్, మునిశేఖర్, సతీష్, శ్రీనివాసులు, సాయి తదితరులు ఉన్నారు.

మామిడి చెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం

మండలంలోని కోటకాడపల్లి పంచాయతీ గ్రామ సరిహద్దు ప్రాంతాలలో ఏనుగులు మామిడి చెట్లను ధ్వంసం చేశాయి. ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి చెట్లను రెవెన్యూ అధికారులు పరిశీలించి రైతుకు నష్టపరహారం చెల్లించడానికి ప్రభుత్వానికి నివేదికను పంపించారు. సుమారు 150 మామిడి చెట్లను ధ్వంసం చేసినట్లు రెవెన్యూ అధికారుల విఆర్ఓ రవి నాయక్, సర్వేయర్ షణ్ముఖ ప్రియా, హార్టికల్చర్ ఆఫీసర్ స్వప్న అంచనా వేశారు. ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నేటినుంచి టిటిడి విశ్రాంత ఉద్యోగులకు శ్రీవారి లడ్డూ ప్రసాదం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల అనంతరం టిటిడి విశ్రాంత ఉద్యోగులకు, కుటుంబ పింఛన్‌దార్లకు అందించే శ్రీవారి లడ్డూ, వడ ప్రసాదాన్ని అక్టోబర్ 15 నుండి 24వ తేదీ వరకు అందించనున్నారు. తిరుపతిలోని టిటిడి క్యాంటీన్ వద్ద గల కొత్త జాబిలి భవనంలో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 05.00 గంటల వరకు వారి వారి టిటిడి స్మార్ట్ ఐడీ కార్డులతో ప్రసాదాలను స్వీకరించాలని టిటిడి కోరుతోంది. టిటిడి పింఛన్‌దార్లు / వారి కుటుంబ పింఛన్ దారులు / సిపిఎస్ వారికి ఒక పెద్ద లడ్డూ, ఒక వడ అందజేస్తారు.

కాలువల్లో వ్యర్థాలు లేకుండా చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నగరంలోని మురుగునీటి కాల్వల్లో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నగరంలోని 44, 35 వార్డుల్లో పారిశుధ్య పనులను కార్పొరేటర్ నారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎక్కడైనా కాలువలు పాడై ఉంటే వాటిని మరమ్మత్తు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సి.పి.ఆర్. అపార్ట్మెంట్ పక్కన ఉన్న రోడ్డులో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండడంతో వీలైనంత వెడల్పు చేసేందుకు చర్యలు చెపడతామని తెలిపారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపి ఖాన్, రెవిన్యూ ఆఫీసర్ రవి పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు



ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల పరిధిలోని, రెడ్డిపాలెం బిట్టు బి1, బాలాజీ నగర్ గ్రామానికి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూములను కొందరు దురాక్రమణ చేస్తున్నారని మంగళవారం తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. భూములు లేని నిరుపేదలకు ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలని వారు కోరారు. తహశీల్దార్ స్పందిస్తూ భూఆక్రమణపై సమగ్ర విచారణ జరిపిస్తామని, అర్హులైన పేదలకు భూ పంపిణీ కార్యక్రమంలో భూములు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

త్వరలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు

: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: వెంకటగిరి, ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తుల దూరప్రాంతాలకు వెళ్లకుండా వెంకటగిరి, సిహెచ్‌సి హాస్పిటల్ లో డయాలసిస్ సెంటర్ తొందర్లోనే ఏర్పాటు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయంసి చైర్మన్, పట్టణ అధ్యక్షులు, నియోజకవర్గ అనుబంధ కమిటీ సభ్యులు, పట్టణ కమిటీ నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూడో జిల్లా జట్టు ఎంపిక పోటీలు



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, శ్రీనివాస క్రీడా ప్రాంగణంలో బాలబాలికల జూడో జిల్లా జట్టు ఎంపిక పోటీలు జరిగాయి, ఈ కార్యక్రమంలో అండర్ 19 స్కూల్ గేమ్స్ సెక్రటరీ డాక్టర్ బాబు అండర్ 14,17 తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీస్ కిషోర్ కుమార్ భార్గవి, పీడీలు చంద్రశేఖర్ రాజు, శ్రీధర్, గోపి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

డేటా సెంటర్ తెచ్చిన ఘనత టీడీపీదే

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విశాఖపట్నంలో ఒక గిగావాట్ హైపర్స్కల్ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్ సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని, వేల కోట్ల పెట్టుబడి, వేల మందికి ఉద్యోగాలను అందిస్తున్న టీడీపీ ప్రభుత్వానికే దక్కుతుందని నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గూగుల్ రాకతో ఎఐ సిటీగా విశాఖపట్నం రూపాంతరం చెందుతున్నారు. రాష్ట్రానికి ఆదాయంతోపాటు యువతకు 1.88 లక్షల ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

19న నీ గానమే.. నా ప్రాణం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, ఐతేపల్లె, జీఆర్కే కల్యాణ మండపంలో ఈనెల 19వ తేదీన అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి ఆధ్వర్యంలో నీగానమే, నా ప్రాణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. అఖండ భజనకు అయ్యప్ప భక్తులు, భజన బృందాలు, గాయకులు విచ్చేసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

జెవివి చెకుముకి గోడపత్రికలు ఆవిష్కరణ



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తిరుపతి జిలా, పుత్తూరు డివిజన్‌లో మంగళవారం ఉప విద్యాశాఖాధికారి మహేశ్వరరావు ఆధ్వర్యంలో జన విజ్ఞానవేదిక నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా పుత్తూరు ఎంఈఓలు తిరుమల రాజు, బాల సుబ్రహ్మణ్యం, యూటీఎఫ్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మణిగండన్, రాష్ట్ర యూటీయఫ్ నాయకులు దాసరి మునెయ్య హాజరయ్యారు. అక్టోబర్ 18న మండల స్థాయిలో, నవంబర్ ఒకటిన జిల్లా స్థాయిలో, 23న ఆయా జిల్లాల్లో నిర్వహించడం పోటీలు జరుగనున్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి, నరేష్, భాస్కర్ మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ కృషి అభినందనీయం



కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సత్కరిస్తున్న జనసేన పార్టీ ఇన్చార్జ్ దేవర మనోహర్

ప్రజాశక్తి - చంద్రగిరి : తిరుపతి జిల్లా అభివృద్ధి దిశగా కృషి చేస్తూ ప్రజల సమస్యలకు పరిష్కార మార్గాలు చూపేందుకు కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ప్రతిష్ఠాత్మ ఎస్‌కెఒసిహెచ్ అవార్డు అందుకోవడం జిల్లాకు స్ఫూర్తిదాయకమని చంద్రగిరి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ దేవర మనోహర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌రు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. శెట్టిపల్లి భూముల వివాదానికి పరిష్కారం చూపడం, పలు అభివృద్ధి ప్రాజెక్టులను సమయానికి పూర్తి చేయించడం, గ్రామీణాభివృద్ధి పథకాలకు ప్రోత్సాహం ఇవ్వడం వంటి కార్యక్రమాలలో కలెక్టర్ కృషి అభినందనీయమని దేవర మనోహర్ పేర్కొన్నారు.

కొండచిలువ కలకలం



ప్రజాశక్తి - చంద్రగిరి: శ్రీవారి మెట్టు నడక మార్గంలో మంగళవారం ఉదయం భారీ కొండచిలువ కలకలం సృష్టించింది. ఉదయం సుమారు 9 గంటల సమయంలో, నడక మార్గం సమీపంలోని చెత్తకుప్పలో ఓ భారీ కొండచిలువ నక్కి ఉండటాన్ని టీటీడీ శానిటేషన్ సిబ్బంది గుర్తించారు. కొండచిలువను చూసి వెంటనే అప్రమత్తమైన శానిటేషన్ సిబ్బంది విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు టీటీడీ ఫారెస్ట్ (అటవీ) అధికారులను అప్రమత్తం చేశారు. అటవీ శాఖ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. కొండచిలువను సురక్షితంగా పట్టుకున్నారు. అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టినట్లు అధికారులు తెలిపారు.

పంచాయతీలు

ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలి



ప్రజాశక్తి - వాకాడు: పంచాయతీలు సొంత స్థానిక ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలని తిరుపతి జిల్లా వాకాడు మండల పరిషత్ పరిపాలన అధికారి సాయి ప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ ఆవరణలోని స్త్రీ శక్తి భవనంలో ఎంపీడీవో సాయి ప్రసాద్ అధ్యక్షతన స్థానిక వనరులపై సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాకాడు డిప్యూటీ ఎంపీడీవో సురేష్, మండల సర్పంచ్ సంఘాల అధ్యక్షులు దువ్వూరు భాస్కర్ రెడ్డి, సర్పంచులు, పంచాయతీ సెక్రెటరీలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఎస్‌డిజి లక్ష్యాల స్థానికరణపై దృష్టి పెట్టాలని పుత్తూరు ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. పంచాయతీ మౌలిక వసతులపై సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, రెండు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాలను పుత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో, ఎంపీడీవో, డిప్యూటీ ఎంపీడీవో, దేవికఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కోట: కోట మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీలు సొంత ఆదాయ వనరుల అభివృద్ధి, సుస్థిరతపై మంగళవారం, బుధవారం రోజుల్లో శిక్షణా కార్యక్రమం సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించబడుతుందని స్థానిక ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో గ్రామపంచాయతీలు సొంత ఆదాయ వనరులు పెంచుకోవాలని సూచించారు.


అరకు ఇన్‌స్టంట్ కాఫీ విడుదల

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: టాటా ఉత్పత్తి, ఆర్గానిక్ ఇండియా, ఇటీవల అరకు ఇన్‌స్టంట్ కాఫీని విడుదల చేసినట్లు టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్, ప్యాకేజ్డ్ బేవరేజెస్, ఇండియా మరియు దక్షిణాసియా అధ్యక్షుడు పునీత్ దాస్ తెలిపారు. ప్రీమియం 100 శాతం అరబికా కాఫీతో తయారు చేయబడిన సర్టిఫైడ్ ఆర్గానిక్ కాఫీ మిశ్రమం ఇదన్నారు. అరకు వ్యాలీ భూముల నుండి తీసుకోబడిన ఈ ఉత్పత్తినైతికంగా సాగు చేసిన సేంద్రీయ పదార్థాల నుండి ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. కాఫీప్రియులకు అరకు లోయ రైతుల పనితనంను వేడుక జరుపుకునే ప్రత్యేకమైన మిశ్రమాన్నిఅందిస్తుందన్నారు. ఈ ఉత్పత్తి 50 గ్రాముల ధర రూ.500. ఆర్గానిక్ ఇండియావెబ్‌సైట్, అమెజాన్, ఆర్గానిక్ ఇండియా స్టోర్‌లతోసహా వివిధ ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

ఆన్‌లైన్‌లో అభిషేకాల టికెట్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : కార్తీక మాసంలో భక్తుల రద్దీ దృష్ట్యా ఈ నెల 20వ తేదీ స్వామి అమ్మవార్ల అభిషేకం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీమృత్యుంజయ స్వామి వారి అభిషేకాల టికెట్లను ఆన్ లైన్ లో పొంద వచ్చని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఈవో పాపిరెడ్డి మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు https://www.aptemples.org వెబ్సైట్‌ను సందర్శించి అభిషేకం టిక్కెట్ నమోదు చేసుకోగలరని విజ్ఞప్తి చేశారు. సదరు అభిషేకం టికెట్ ఆన్లైన్ నందు నమోదు చేసుకున్న భక్తుల ఆధార్ కార్డ్ వివరాలను కౌంటర్ నందు పరిశీలించిన పిమ్మటే అభిషేకాలకు అనుమతిస్తారని తెలిపారు.

కలెక్టర్, ఎస్పీలను కలిసిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



ప్రజాశక్తి - నాయుడుపేట: నియోజకవర్గంలోని సమస్యలు పరిష్కారానికై, నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నడిపించడానికి అనేక విధాల కార్యక్రమాలు చేపట్టనున్నామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ నియోజకవర్గ అభివృద్ధికై నాయుడుపేట టిడిపి నాయకులతో కలిసి మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీలను కలిసి పలు కార్యక్రమాల గురించి చర్చించినట్లు తెలిపారు. తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని శాంతిభద్రతలపై, ప్రజా సంక్షేమ అంశాలపై చర్చించారు. అనంతరం తిరుపతిజిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్‌ని కలిసి నియోజకవర్గ అభివృద్ధి, పరిపాలనా అంశాలపై సమావేశమయ్యారు. ఈ సమావేశంలో వెంట ఆమె భర్త సూళ్లూరుపేట నియోజకవర్గం టిడిపి నాయకులు పార్థసారథి, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ 786 రఫీ టిడిపి నాయకులు ఉన్నారు.

పిహెచ్‌సీ వైద్యుల డిమాండ్లు నెరవేర్చాలి

ప్రజాశక్తి - చంద్రగిరి: పీహెచ్‌సీల వైద్యుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పీహెచ్ సీస్ వైద్య సిబ్బంది, సూపర్వైజర్ల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ప్రభుత్వ వైద్యులకు మద్దతుగా నల్ల బ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లకి పైగా పీహెచ్‌సీ వైద్యులు ఎటువంటి పదోన్నతులు లేకుండా ఒకే స్థాయిలో పనిచేస్తున్నారని, నాలుగేళ్ల సర్వీసు దాటిన వారికి ప్రమోషన్లు కల్పించాలన్నారు. ఇన్ సర్వీస్ పీజీ కోటాను 30 శాతానికి పెంచాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు 50 శాతం మూలవేతనం అదనంగా ఇవ్వాలన్నారు. డాక్టర్ల సమ్మెకు మద్దతుగా భోజన విరామ సమయంలో ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది నిరసన తెలిపారు.

తపాలా ఖాతాదారులకు ఆరోగ్య బీమా పాలసీలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: తక్కువ ప్రీమియంతో తపాలా ఖాతాదారులకు హెల్త్, క్యాన్సర్, ప్రమాద భీమా పాలసీలను అందిస్తున్నట్లు పుత్తూరు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ పేర్కొన్నారు. మంగళవారం పుత్తూరు ఐపీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనపరిచిన తపాలా సిబ్బందికి బహుమతులను అందజేశారు. సతీష్ మాట్లాడుతూ ఏడాదికి రూ 350 నుండి రూ 800 ప్రీమియంతో 5 లక్షల నుండి 15 లక్షలకు ఆరోగ్య, ప్రమాద భీమాలను తపాలా శాఖ అందిస్తోందన్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా నారీ సురక్ష హెల్త్ పాలసీ ద్వారా క్యాన్సర్ చికిత్సకు లక్ష రూపాయల కవరేజిని రాయల్ సుందరం అందిస్తోందని, ఐపీపీబీ తిరుపతి బ్రాంచ్ మేనేజర్ శైలేష్ తెలిపారు.

రేపటి నుంచి 'యువతరంగ్ -2025'

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు స్టూడెంట్ వెల్ఫేర్, కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 16,17,18 తేదీల్లో యువతరంగ్ 2025 కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వివిధ కాలేజీల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని శాప్ ఛైర్మన్ రవి నాయుడు, ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య నరసింగరావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు లాంఛనంగా ప్రారంభిస్తారని, కల్చరల్ విభాగం డైరెక్టర్ ఆచార్య మురళీధర్, సమన్వయకర్త వివేక్ తెలిపారు.

నాడు హైదరాబాద్.. నేడు విశాఖ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : సీఎం చంద్రబాబు నాడు హైదరాబాదును హైటెక్ సిటీ గా మార్చగా.. నేడు విశాఖను అదే రీతిన అభివృద్ధి చేసేందుకు గూగుల్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కొనియాడారు. ఢిల్లీలోని తాజ్ మాన్ హెూటల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ మంగళవారం గూగుల్ సంస్థ ప్రతినిధులతో భేటీకాగా బొజ్జల కూడా వారితో పాటు పాల్గొన్నారు. అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో తాను కూడా పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. నవ్యాంధ్ర నవ శకానికి ఇదో నాంది అని కీర్తించారు.

28న 'జోనింగ్ నిబంధనల'పై వర్కుషాపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతిలో 'జోనింగ్ నిబంధనలు - శక్తి సామర్థ్య అధ్యయనం'పై ఈనెల 28న కచ్చపి ఆడిటోరియంలో అవగాహనా సదస్సు, వర్కుషాపు నిర్వహించనున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. అమృత్ పథకం కింద విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ బృందం నగరంలో నిర్వహించిన పైలెట్ ప్రాజెక్టు సర్వే వివరాలను మంగళవారం కమిషనర్‌కు వివరించారు. కేంద్ర ప్రభుత్వం విద్యామంత్రిత్వ శాఖకు చెందిన జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విజయవాడ ' ఎనర్జీ ఎఫిషెన్సీ కన్సిడరేషన్స్ ఇన్ జోనింగ్ రెగ్యులేషన్స్ అండ్ స్టడీ ఆఫ్ తిరుపతి' అనే ప్రాజెక్టును చేపట్టింది. ఈ అధ్యయనం ద్వారా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జోనింగ్ నియమాలు, విద్యుత్ శక్తి వినియోగంపై ఎలా ప్రభావం చూపుతున్నాయో విశ్లేషించడం, తగిన సవరణలు, ప్రణాళికాత్మక జోక్యాల ద్వారా విద్యుత్ శక్తి వినియోగాన్ని తగ్గించే మార్గాలను గుర్తించడం లక్ష్యంగా ఉంది. ఈ ఫలితాలు భవిష్యత్ పట్టణ ప్రణాళిక విధానాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రొఫెసర్ జనమేజయ్, డిప్యూటీ సిటీ ప్లానర్ మహబూబ్‌ఖాన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మూర్తి పాల్గొన్నారు.

సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి రూరల్ సి. గొల్లపల్లి, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇండియా హ్యాకతాన్ కార్యక్రమాన్ని మంగళవారం సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థులు నిర్వహించవలసిన ప్రతిరోజు కార్యక్రమాల్ని చాలెంజింగ్‌గా తీసుకొని సాధించడం ద్వారా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించడం ద్వారా వారిలోని నూతన ఉత్తేజాన్ని నింపడం ముఖ్య ఉద్దేశం అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు వివిధ విభాగాల విభాగాధిపతులు అధ్యాపకులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల అభివృద్ధిబాటకే పిపిపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత వైసిపి హాయంలో తీసుకొచ్చిన 17 మెడికల్ కళాశాలకు సంబంధించి రూ.8480 కోట్ల రూపాయలను అంచనా వ్యయంగా చెప్పి కేవలం రూ.1550.39 కోట్లు ఖర్చు చేసి మెడికల్ కళాశాల నిర్మాణానికి ఏ మాత్రం సహకరించని జగన్ నేడు కూటమి ప్రభుత్వం పిపిపి పద్ధతిలో అసంపూర్తిగా మిగిలిన 10 మెడికల్ కళాశాలలను అభివృద్ధి చేస్తుంటే వక్రబుద్ధితో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిపిపి పద్ధతిలో మెడికల్ కళాశాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే కాక దాని నిర్వహణ బాధ్యతను ప్రైవేటు వారే భరించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే దీనిపై బురద జలటం మంచి పద్ధతి కాదన్నారు.

అంధులను ప్రోత్సహించడం అభినందనీయం



ప్రజాశక్తి- వెంకటగిరి: దృష్టి లోపం కలవారిలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. వెంకటగిరికి చెందిన రాష్ట్ర బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి పెంచల నరసయ్య మంగళవారం జిల్లా ఎస్పీని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెంచల నరసయ్య వెంకటగిరిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తమ అసోసియేషన్ తరపున మధ్యప్రదేశ్ గ్వాలియర్‌లో గత నెల 26వ తేదీ నుంచి 29 వరకు జరిగిన బ్లైండ్ స్పోర్ట్స్‌లో రాష్ట్రానికి చెందిన పలువురు బ్లైండ్ క్రీడాకారులు ప్రతిభ చాటిన వైనాన్ని జిల్లా ఎస్పీకి వివరించి అంధుల జీవితాలలో మనోధైర్యం చేపడుతున్న కార్యక్రమాలకు సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు.

రోగులను పట్టించుకోండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నారాయణవరం మండలం కశిమిట్ట పంచాయతీ, ఇప్పతంగాల్ గ్రామంలో గత నెల రోజులుగా డెంగీ, టైఫాయిడ్ వైరల్ ఫీవర్‌లతో సుమారు 20 మంది రోగులు ఆసుపత్రి చుట్టూ తిరుగుతున్నా వైద్యాధికారులుకానీ, పంచాయతీ అధికారులు కానీ గ్రామం వైపు కన్నెత్తి చూడలేదని సిపిఐ పార్టీ జిల్లా సమితి సభ్యులు మహేష్ ఆరోపించారు. వైద్యాధికారులు స్పందించి బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

నాడు విద్యార్థి.. నేడు ఉపాధ్యాయుడు



ప్రభు కుమార్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తాను చదువుకున్న పాఠశాలకే ఉపాధ్యాయుడయ్యాడో పూర్వ విద్యార్థి. ఏపీ డీఎస్సీ పురపాలక సంఘానికి ఎంపికైన 22 మంది ఉపాధ్యాయుల్లో ప్రథమ ర్యాంకు, మెగా డీఎస్సీలో 50వ ర్యాంకు సాధించి భాస్కర్ పేట ఉన్నత పాఠశాలకు బోధకుడిగా నియమితులయ్యారు కొప్పుల ప్రభు కుమార్. తన సొంత ప్రాంత విద్యార్థులకు తాను చదువుకున్న పాఠశాలలోనే విద్యాబుద్ధులు నేర్పించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నట్లు ప్రభు కుమార్ తెలిపారు.

సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నాయుడుపేట: విద్యుత్ కార్మికులను సంస్థలో విలీనం, రెగ్యులైజేషన్ కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ అక్టోబర్ 15 వ తేది బుధవారం చేపడుతున్న సమ్మెను జయప్రదం చేయాలని నాయుడుపేట సిఐటియు మండల కార్యదర్శి శివకవి ముకుంద పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గ శ్రేయస్సు కోసం సంస్థ పరిరక్షణకై కార్మికల, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఈ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్మికుని శ్రేయస్సే దేశ శ్రేయస్సని ప్రతి ఒక్కరూ భావించి ఈ పోరాటానికి మద్దతు తెలిపి కార్మికులను ముందుకు నడిపించాలని కోరారు.

గీతా గోవిందం సేవా సమితి కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: గీతా గోవిందం సేవా సమితి కార్యక్రమాలు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలు మరింతగా విస్తృతపరిచేందుకు నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఓ ప్రైవేట్ హోటల్లో సేవా సమితి సభ్యులతో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బాలగురప్ప, ఉపాధ్యక్షులుగా డా.వెంకట రమణ, కార్యదర్శిగా కె. గుణశేఖర్, కోశాధికారిగా మధుసూదన్, కార్యనిర్వాహక కార్యదర్శిలుగా సి.మునీంద్రన్, డాక్టర్ శ్రీధర్, హరికృష్ణ, పద్మావతిలను ఎన్నుకున్నారు. మరో పది మందిని కార్యనిర్వాహక మండలి సభ్యులుగా ఎన్నుకోవడం జరిగినట్లు గీతా గోవిందం సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దామోదర్ రావు యాదవ్ తెలియజేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి పరిధిలో కె.సి.పేట సబ్ స్టేషన్‌లో అన్ని ఫీడర్లు మరమ్మతుల కారణంగా 15 తేది బుధవారం ఉదయం 9 నుండి 1 గంట వరకు విద్యు త్ సరఫరా నిలిపివేయ బడునని ఏపిఎస్పీడీసీయల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ విద్యుత్ ఈఈ గంగాధర్ రావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

క్రైం న్యూస్

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: నింద్ర మండలం, అత్తూరులో అక్రమ రేషన్ బియ్యం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నింద్ర ఎస్సై మల్లికార్జున్ తెలిపిన వివరాల మేరకు గ్రామంలోని ప్రభుత్వ వెలుగు కార్యాలయంలో సుమారు 2 టన్నులు బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు తెలిపారు. ఈ బియ్యాన్ని తమిళనాడుకు తరలించేందుకు నిల్వ చేసినట్లు విచారణలో తేలిందన్నారు. నిందులకోసం విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం.. ఇద్దరి అరెస్ట్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సోషల్ మీడియాలో ప్రభుత్వంపై, ఎక్సైజ్ అధికారులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఎక్సైజ్ సీఐ మండవల్లి రామచంద్రకు అందిన ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్‌పి రవి మనోహరాచారి తెలిపారు. తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎక్సైజ్ సీఐ ఫిర్యాదుతో ప్రాథమిక విచారణ జరిపామని, సీసీ కెమెరాల ద్వారా సమాచారాన్ని సేకరించి, ఆధారాలను పరిశీలించామని తెలిపారు. పోలీసులు విచారణలో విక్టరీ వైన్స్, కపిలతీర్థం రోడ్డు వద్ద ఒక వ్యక్తి తాగి పడిపోతే, అది కల్తీమద్యం వలన అని వైసీపీ సోషల్ మీడియా పేజీలో తప్పుడు ప్రచారం చేశారని తెలిపారు. వైసీపీ సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతూ అటు ప్రభుత్వానికి, ఇటు ఎక్సైజ్ శాఖకు చెడ్డపేరు తీసుకువచ్చారని తెలిపారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం పీఏ చంద్రశేఖర్ వెంకటేష్ ఏ1 గా, వైసీపీ సోషల్ మీడియా సభ్యుడు బ్రుంగి నవీన్ ఏ2 గా గుర్తించామన్నారు. చంద్రశేఖర్ వెంకటేష్ వీడియో తీస్తే, దాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేసింది బ్రుంగి నవీన్ అని తెలిపారు. సోమవారం వీరిద్దరిని అరెస్ట్ చేశామన్నారు.

మానవత్వం చాటుకున్న పాకాల పోలీసులు

ప్రజాశక్తి - పాకాల: తిరుపతి జిల్లా, పాకాల పోలీసులు సమయస్ఫూర్తి, సేవాభావం, అప్రమత్తతతో ఒక బాలుడి ప్రాణాన్ని కాపాడి మానవత్వం చాటుకున్నారు. పాకాల, భారతమిట్ట, 7వ క్రాస్ ప్రాంతంలో నివసిస్తున్న దిలీప్ కుమార్, కుమారుడు చౌదరి (15), చంద్రగిరి గవర్నమెంట్ బాయ్స్ హైస్కూల్ అండ్ కాలేజ్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. సోమవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో, అఖిల్ మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా చాటింగ్ చేస్తున్నాడని గమనించిన తల్లి, మొబైల్ తీసుకుని ఇవ్వకుండా ఉంచడంతో, ఆగ్రహానికి గురైన బాలుడు చాకు తీసుకుని రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. తరువాత కొద్దిసేపటికే, కొద్దిసేపటికే అపస్మారక స్థితికి వెళ్ళిపోయాడు. తల్లిదండ్రుల భయాందోళనలతో డయల్ 112 ద్వారా సమాచారం అందించగా, పాకాల పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసు సిబ్బంది రమేష్, చెంగయ్య సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తలుపు బద్దలు కొట్టి బాలుడిని బయటకు తీసి, 108 అంబులెన్స్ ద్వారా కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాలుడు ఆరోగ్యంగా తిరిగి ఇంటికి చేరాడు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పోలీసులను అభినందించారు.

ఎంపీ మిథున్ రెడ్డి ఇంట్లో సిట్ సోదాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఇంటిలో సిట్ అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. లిక్కర్ స్కామ్ వ్యవహారంలో ఇప్పటికే జైల్లో ఉండి బెయిల్ పై విడుదలైన మిథున్ రెడ్డి పై సిట్ అధికారులు మరోసారి పంజా విసిరారు. తిరుపతి, బెంగళూరు, హైదరాబాదులోని ఎంపీ పెద్ద రెడ్డి మిథున్ రెడ్డి నివాసాలల్లో ఏకకాలంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి నివాసం వద్ద ఎంపీ తండ్రి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కూడా సిట్ అధికారులు పలు విషయాలు పై విచారించినట్లు సమాచారం. సిట్ అధికారులు మంగళవారం సాయంత్రానికి సోదాలు ముగించి తిరిగి వెళ్ళిపోయారు.

మేయర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: అహ్మదాబాద్‌లో జరగనున్న జాతీయ మేయర్ల శిఖరాగ్ర సమావేశానికి తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీషను అహ్మదాబాద్ నగరపాలక సంస్థ ఆహ్వానించింది. నేషనల్ అర్బన్ కంక్లేవ్ అండ్ మేయర్ అల్ సమ్మిట్ ఫర్ షే పింగ్ ది ఫీచర్ ఆఫ్ సిటీ పేరుతో జరగనున్న ఈ శిఖరాగ్ర సమావేశానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. రెండు రోజుల జాతీయ సమావేశంలో జరగనున్న వివిధ అంశాలపై జరగనున్న సదస్సులలో డాక్టర్ శిరీష పాల్గొని ప్రసంగించనున్నారు.

విజయవాడలో జరిగే ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విఆర్ఏల సమస్యల పరిష్కారానికి, విజయవాడలో జరుగుతున్న ధర్నాను జయప్రదం చేయాలని విఆర్ఏల సంఘం జిల్లా కార్యదర్శి కొల్లపూడి సుబ్బయ్య పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ విఆర్ఏలకు పే స్కేల్ ప్రకారం జీతాలు చెల్లించాలని అదేవిధంగా ప్రమోషన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని విఆర్ఏలు పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.